


గుడిసె బయటికి వచ్చి చూచాడు మైసయ్య. చలిచలిగా వుంది. ఆకాశం కేసి చూశాడు. చలికి చంద్రుడు మబ్బు దుప్పటి కప్పుకొన్నాడు. కానరాలేదు.

వాడవాడంతా నిద్రలో ఉంది. అక్కడక్కడా అలికిడి వుందంటే; దగ్గరగా ఉన్న రైలుపట్టాలవేపు చూసి, తొందరగా మెలకువ వచ్చిందనుకొన్నాడు మైసయ్య.

“అయిదు కాలేదు” అనుకొన్నాడు. అలా అనుకొన్నాడో లేదో ఏదో రైలుపట్టాల మీంచి పరుగుతీస్తో వస్తోన్న శబ్దం వచ్చింది.

“అయిదయింది” అనుకొన్నాడు.

ఆ వేళప్పుడొచ్చే ఆ రైలు మైసయ్యకి గడియారం లాంటిది. అలారంలా శబ్దించి వాణ్ని మేలుకొలుపుతుంది. పట్టాలమీంచి పారిపోయే ప్రతి రైలూ వాడికి కాలాన్ని సూచిస్తాయి. ఆ రైళ్లపేర్లు వాడికి తెలియకపోవచ్చు; అది అప్రస్తుతం.

బుడ్డి దీపాన్ని పెద్దది చేశాడు మైసయ్య. గుడిసంతా వెలుగుతో పండిపోయింది. అటు మూలగా నడిచి, అక్కడ ఉన్న సంచిని ముందుకు లాక్కొని కూర్చొన్నాడు.

సంచిలోనికి చేయి పోనిచ్చాడు. రబ్బరు బెలూన్లు చల్లచల్లగా తగిలాయి. అన్నీ కింద గుమ్మరించాడు. చిన్నా పెద్దా కుప్పగా నిలిచాయి. అయిదు పెద్ద బెలూన్లు తీసి, ఊది పెద్దపెద్దగా చేశాడు. దారంతో వాటి మూతుల్ని బిగగట్టి గాలి పోనివ్వక జాగ్రత్తపడ్డాడు. అలాగే అయిదు చిన్న బెలూన్లకు గాలూదాడు. రెండు పేలిపోయాయి. మూడు మిగిలాయి. ఎనిమిదింటినీ ఎడమచేతి మణికట్టుకు కట్టుకొని, సంచిని భుజాన్న తగిలించుకొని, దీపాన్నార్పేసి బయటికొచ్చాడు. గుడిసెమీదికి ఎత్తిగట్టిన గోనెసంచి పరదాను దిగలాగి ముందుకు కదిలాడు మైసయ్య.

---

**రూపాంతరం-6**

నిర్మించమన్నాట్ట! అందుకని గుడిసెవాసులందరినీ ఆయన పొమ్మన్నారు. పోమంటే, వూరక పోవద్దు, గుడిసెకి యాభై రూపాయలు ఇస్తానన్నాట్ట! కాదంటే కారాలు మిరియాలూ నూరాట్ట! కన్నింతా గుడ్డింతా చేసి పోలీసుల్ని రప్పిస్తాను! నా తడాఖా చూపిస్తానని వెళ్ళాట్ట! "ఈ స్థలం గవర్నమెంటుది" అంటోంది ఓ గుంపు.

"కాదు కాదు. గవర్నమెంటు గిరీ ఉన్న ఓ షావుకారిది" అంటోంది మరో గుంపు.

"పది పన్నెండేళ్లుగా లేని హక్కుదారులు ఈరోజా ఎక్కణ్ణుంచి పుట్టుకొచ్చారు" అనడుగుతోంది ఇంకో గుంపు.

గందరగోళంగా వుంది పరిస్థితి. వాడలో మగాళ్ళు లేరు. ఆడంగులే తలో మాటా పంచుకొంటున్నారు. ఫలితంగా త్వరగా విషయం తేటతెల్లమయింది మైసయ్యకి.

మగాళ్ళని పిలుచుకు రమ్మనమని పిల్లల్ని, ముసలాళ్లని పంపారంతా. మైసయ్యనీ ఓ దిక్కుకు పురమాయించారు.

సాయంత్రమయింది.

చీకటి, చలీ వాడను చుట్టుముట్టాయి. ఏదో రైలు పట్టాల మీంచి పోతోంది.

ఏడు గంటలయింది అనుకొన్నారు మైసయ్య. ఆ సరికి, కలిగినకాడికి తిని, వాడలో కొలువు తీరారు మగాళ్ళు. మళ్ళీ రాని కాంట్రాక్టర్ను గురించి, తోడ్చుకురాని పోలీసులను గురించి చర్చించారు.

"బెదిరిపోయుంటాడు బాబు" అని నవ్వుకొన్నారు చివరికి,

పది గంటలకి పడుకొన్నారంతా.

గాఢ నిద్రలో ఉంది వాడ. చీకటిలో చీకటిగా ఉంది. నగరం ముఖం మీద కాలిన మచ్చలా ఉంది. రెప్పలేని కాటుక కన్నులా ఉంది. తెప్పరిల్లని మూర్ఛరోగిలా ఉంది.

అప్పుడు—

అప్పుడంటే అప్పుడు వెచ్చ వెచ్చని సెగలు రేగి, పొగలు చెలరేగడంతో వాడ వాడంతటికీ హోరున తెలివొచ్చింది. తెలివొచ్చి చూసేసరికి, భోరు భోరున విలపించాల్సి వచ్చింది.

మంటలో మురికివాడ కాలిపోతోంది. నగర ముఖమ్మీద సిందూరంలా మెరిసిపోతోంది. అగ్నికీలల్లో ఆ ప్రదేశమంతా, మహారాణికి నేసిన బంగారు జలతారు చీరెలా ఉంది.

మురికి, మసి కావడానికి గంట వ్యవధి పట్టలేదు. పసిపిల్ల బాలాదంతా పట్టాలపైకి చేరారు. ప్రాణాల్ని నిలబెట్టుకొన్నారంతే!

"ఇదంతా కాంట్రాక్టర్ పని" అని కళ్ల నీళ్ళు పెట్టుకొన్నారుగాని కసిని పెంచుకోలేదెవరూ. పేదవాళ్ళకి పగలుండరాదు! అది ఆర్యుల సూక్తి. అందుకు బద్ధులయ్యారు.

ఏదో రైలు పట్టాలమీంచి పరుగులేస్తూ వస్తోన్న శబ్దం వినవచ్చింది. అంతా లేచి, పట్టాలకి దిగువన నిల్చున్నారు.

"అయిదయింది" అనుకొన్నాడు మైసయ్య.

ఇక బయల్దేరాలి. బెలూన్లను అమ్మజూపాలి. కాని బెలూన్లు లేవు! గుడిసెతో పాటు కాలిపోయాయవి.

మరేం చేయాలి!? పొట్ట నెలా పోషించుకోవాలి!? పాలుపోలేదు మైసయ్యకి. పెట్టుబడికోసం మళ్ళీ అప్పు చేయలేదు. చేసే స్థితి వాడికి ఉన్నా ఇచ్చే నాధుడు లేడు.

అందుకని——

బిచ్చమెత్తుకొని బతకడం మేలనుకున్నాడు. కాలు, చేయుంటే బిచ్చగానిపై కనికరం చూపరని అనుకొన్నాడు. పేవ్‌మెంటు మీద విరిగిన చెక్కబొమ్మలా ఉండాలనుకొన్నాడు. కాలో, చేయో ఉండరాదనుకొన్నాడు. అనుకొని, పరుగులేస్తూ వస్తోన్న రైలుకి, నైవేద్యం చేసేందుకు కాలుని పట్టాలపై ఉంచాడు.

కాసేపట్లో నగర రక్కసి చేతి మెటికలు విరుచుకొనే శబ్దాన్ని వినగలం!!